క్లుప్తంగా

కౌలు రైతులు ప్రజావేదికకు తరలిరండి

బోథ్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఎం భవన్‌లో మంగళవారం నిర్వహించనున్న కౌలురైతు ప్రజావేదికకు కౌలు రైతులు తరలిరావాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులు ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదన్నారు. వారిని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలన్నారు. 2011 అధీకృత సాగుదారుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

నేరడిగొండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ అని జెడ్పీఎస్ఎస్ వడూర్ ఎస్ఎంసీ చైర్మన్ కొప్పుల గంగారెడ్డి అన్నారు. మండలంలోని సుర్దాపూర్ గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థి దడింజ శ్రీకాంత్‌తో పాటు ఆయన తమ్ముడు, చెల్లెల చదువు కోసం సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా బడి మానేసిన, బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు.

అర్హులందరికీ 'దళితబంధు' ఇవ్వాలి

ఇంద్రవెల్లి: అర్హులైన ప్రతిఒక్కరికీ దళితబంధు ఇవ్వాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని దళితులతో కలిసి అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు పుర్క బాపురావ్, పెందోర్ ప్రభాకర్, సునిల్, సోన్ కాంబ్లే బావురాజ్ పాల్గొన్నారు.

9న గొర్రెల పంపిణీ

బోథ్: గొల్లకుర్మలకు ఈనెల 9న గొర్రెలు పంపిణీ చేయనున్నట్లు బోథ్ సర్పంచ్ సురేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సోమవారం గొల్లకుర్మలు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నుంచి గొర్రెలు తీసుకురావడానికి వెటర్నరీ అధికారులతో కలిసి బయల్దేరారు.

యూటీఎఫ్ ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్‌గా శివన్న

జైనథ్: టీఎస్ యూటీఎఫ్ ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ ఈరగొల్ల శివన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జైనథ్ మండలం పిప్పల్‌గావ్ ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన మాట్లాడుతూ.. యూటీఎఫ్ సభ్యులు ఎవరైన ప్రమాదంలో మృతి చెందితే, వారి కుటుంబ సభ్యులకు ఆదుకునేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

దైవ చింతనతోనే మోక్ష మార్గం

నేరడిగొండ: దైవ చింతనతోనే మోక్ష మార్గం లభిస్తుందని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో పోచమ్మ తల్లి ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. సోమవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యువత భక్తిభావంతో ముందుకు సాగాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సైతం పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జాదవ్ పరుశురాం, అడిగం రాజు, ఉప సర్పంచ్‌లు దేవేందర్ రెడ్డి, ఉషర్ సింగ్, గులాబ్ సింగ్, సవయి రామ్, జైసింగ్ సర్దార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

ఆదిలాబాద్‌టౌన్: జీ20 కార్యక్రమంలో భాగంగా జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని మహలక్ష్మివాడలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రోగ్రాం అధికారి రాజన్న మాట్లాడుతూ.. సామాజిక సమానత్వ సాధన కోసం ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంతోశ్, ఉమ, సుకేష్ణ పాల్గొన్నారు.

న్యూయార్క్ సభలో శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: అమెరికాలోని న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వెళ్లిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులను కలిశారు.

'పత్తి విత్తనాలు మహారాష్ట్ర రైతులకు అమ్మొద్దు'

బేల: పత్తి విత్తనాలను మహారాష్ట్ర రైతులకు అమ్మవద్దని ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విత్తన ప్యాకెట్ నిల్వలు, బిల్‌బుక్‌లు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. పత్తి విత్తనాలను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి ఉమర్ ఉన్నారు.

అద్దె భవనాల్లో అవస్థలు

- భీంపూర్ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఒకే భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలతో పాటు నూతన మండలాలను ఏర్పాటు చేసి 6 సంవత్సరాలు గడుస్తున్నా.. ప్రభుత్వ కార్యాలాయాలకు సొంత భవనాల నిర్మాణం చేపట్టలేదు. దీంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆర్భాటంగా మండలాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం కార్యాలయాలను ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైంది. తాంసి మండలం నుంచి నూతనంగా ఏర్పడిన భీంపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ శాఖ, ఐకేపీ కార్యాలయాలన్నీ అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. నెలకు వేల రూపాయల అద్దె చెల్లించడం ద్వారా ప్రజా ధనం వృథా అవుతోందని పలువురు అంటున్నారు. తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు ఒకేభవనంలో కొనసాగడంతో అధికారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని శాఖలకు స్థల సేకరణ కూడా పూర్తి కాలేదు. పోలీస్‌స్టేషన్ పాత ఆస్పత్రి భవనంలో కొనసాగుతోంది. ఐకేపీ కార్యాలయం సైతం నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనంలో కొనసాగగా.. వివిధ శాఖల కార్యాలయాలకు భవనాలు కరువయ్యాయి.

ప్రారంభం కాని పనులు..

భీంపూర్ మండల కేంద్రం సమీపంలోని ప్రభుత్వ భూమిలో అధికారులు నూతన భవనాలకు స్థల సేకరణ చేపట్టిన నిధులు విడుదల కాక నేటికి పనులు ప్రారంభం కాలేదు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్ వివిధ శాఖల కార్యాలయాలకు స్థల సేకరణ చేపట్టినా.. ఇప్పటికి అడుగు కూడా ముందుకు పడటం లేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో స్థల సేకరణ విషయంలో అయోమయంలో ఉండడంతో నూతన భవనాలు ఎప్పుడు నిర్మిస్తారని ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. మండల విద్యా వనరుల భవనం పూర్తయినా.. నేటికి ప్రారంభించ లేదు. కస్తూరిబా పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి.

ఇన్‌చార్జి పాలనలోనే..

నూతన మండలం ఏర్పడి ఆరు సంవత్సరాలు అవుతున్నా.. ఆయా శాఖల అధికారులు ఇన్‌చార్జిగానే కొనసాగుతున్నారు. తహసీల్దార్, పోలీస్‌శాఖ, మండల పరిషత్ అధికారులను మాత్రమే వేరుగా కేటాయించినప్పటికీ వివిధ శాఖల అధికారులు ఉమ్మడి తాంసి మండలానికి ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. రెండు మండలాలకు అధికారులు బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ప్రజలకు సరైన సేవలు అందడం లేదు. విద్యశాఖ, వ్యవసాయశాఖ, సొసైటీ అధికారులు ఉమ్మడి మండలంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త భవనాలు నిర్మించాలి



భీంపూర్ మండల కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించలేదు. అద్దె భవనాల్లో అధికారులు విధులు నిర్వహించలేక ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో కార్యాలయాలకు భవనాలు నిర్మించాలి.

– జనార్దన్, పిప్పల్‌కోటి, గ్రామస్తుడు

స్థలం కేటాయింపులో జాప్యం



భీంపూర్ మండలం ఏర్పడడంతో మండల ప్రజలకు పాలన చేరువైంది. కానీ నూతన కార్యాలయాలకు భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. స్థలం కేటాయింపులో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– వంశీ కుమార్, మార్కగూడ, యువకుడు

వైద్యరంగానికి పెద్దపీట

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం రిమ్స్ ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిమ్స్‌లో రక్త నిల్వలు తక్కువగా ఉన్నాయని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఆస్పత్రుల్లో సరైన మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత 33 జిల్లాల్లో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు శ్యామ్‌ప్రసాద్, సుమలత, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, బాలశంకర్ కృష్ణ, రిమ్స్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకు క్రీడలు తోడ్పాటు

ఆదిలాబాద్: చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా క్రీడ పోటీలు తోడ్పడతాయని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో కేకే స్విమ్మింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పోటీలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారధి, భారత జాగృతి అధ్యక్షులు రంగినేని శ్రీనివాస్ రావు, కేకే అకాడమీ నిర్వాహకులు, కోచ్ కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి


మన్నూర్‌లో అవగాహన కల్పిస్తున్న సుజాత్‌ఖాన్


మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి నారాయణ

గుడిహత్నూర్: బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సీతాగోంది, మన్నూర్‌లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. అర్హులైన బోధనా సిబ్బందితో పాటు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తున్నామన్నారు. పాఠశాలలో చేరిన విద్యార్థుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో నారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇచ్చోడ: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయులు గణేష్, రవికాంత్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలో దూబార్‌పేట్, దేశ్‌ముఖ్‌నగర్‌లో పర్యటించి బడీడు పిలల్లను గుర్తించారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఆదిలాబాద్‌లో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా డ్రాప్‌అవుట్, అనాథ, విధివంచిత పిల్లల కోసం 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

- ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని అడేగామ(బి), జామిడి గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు పిల్లలు ప్రతిఒక్కరూ బడిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, ప్రధానోపాధ్యాయులు భూమన్న, బాపురావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

నార్నూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కళాశాల అడ్మిషన్ ఇన్‌చార్జి కాంబ్లే బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని శేకుగూడ గ్రామంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల బృందం గ్రామ పటేల్ మల్కు, పూర్వ విద్యార్థులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. విశాలవంతమైన భవనం, తరగతి గదులతో పాటు విద్యార్థినులకు ప్రత్యేక వేటింగ్ హాల్, సౌకర్యావంతమైన ల్యాబ్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుజాత, సిబ్బంది గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి'

ఎదులాపురం: బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందజలో ఉందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని బొక్కలగూడలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, రోకండ్ల రమేశ్, పట్టణ అధ్యక్షుడు అజయ్, పండ్ల శ్రీనివాస్, జోగు మహేందర్, స్వరూపరాణి పాల్గొన్నారు.

'అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తాం'

తాంసి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలోని అంతర్గాంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంతోశ్, నాయకులు అన్ను పటేల్, అజయ్, సతీశ్, అశోక్, రమేశ్, కిసాన్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ — శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



నేరడిగొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. గదుల కొరతతో రికార్డులను సజ్జలపై ఉంచారు. కార్యాలయానికి నూతన భవనాన్ని మంజూరు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

– అధికారి పేరు: రమేశ్ రాథోడ్, ఆర్డీవో, ఆదిలాబాద్, ఫోన్: 94910 53611

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత


నేరడిగొండ: అవగాహన కల్పిస్తున్న అధికారులు


బోథ్: మొక్క నాటుతున్న జడ్జి బి.హుస్సేన్


ఆదిలాబాద్: చెత్తను తొలగిస్తున్న డీఎం కల్పన

బోథ్: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ బి.హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మొక్కలు నాటారు. ప్రకృతిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో బర్నోబా, ఎఫ్ఆర్‌వో తొడిశెట్టి ప్రణయ్, న్యాయవాదులు పంద్రం శంకర్, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, సర్పంచులు సురేందర్ యాదవ్, మల్లేష్, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణ దినోత్సవానికి ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోరెంగా గాంధారి హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఫారెస్ట్ రెంజ్ అధికారి సంతోశ్, జీవ వైవిధ్య మండలి జిల్లా కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపినాథ్, పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, డీఆర్‌వో విజయనంద్‌రెడ్డి, ఎఫ్ఎస్‌వోలు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉట్నూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ టి. దుర్గారాణి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయవాదులు ధీరజ్ గుప్తా, సీహెచ్. గిరి, జైవంత్‌రావు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: హలియన్స్ ఫర్ చైల్డ్ రైట్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా సెడ్స్, మహితా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్ కాలనీలో చిన్నారులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పర్యావరణం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగ్‌రాం, శ్రీనివాస్, దయాకర్, నర్సింగ్‌రావు, విజయ్‌కుమార్, అష్రఫ్ అలీ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఉట్నూర్) డైరెక్టర్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సిబ్బంది ఆశన్న, మల్లయ్య, సతీశ్, రమేశ్, బాబు, రజిని, సృజన, భాగ్య పాల్గొన్నారు.

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సిరిచెల్మ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్ అన్నారు. సోమవారం కుంటాల జలపాతం వద్ద సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్‌ను తొలగించారు. అలాగే పచ్చదనం ప్రాధాన్యత గురించి పర్యాటకులకు వివరించారు. సిరిచెల్మ డిప్యూటీ ఆర్‌వో అమర్ సింగ్, కుంటాల సెక్షన్ అధికారి వసంత్ కుమార్, ఎఫ్‌బీవో సచిన్, సందీప్, సంతోశ్ పాల్గొన్నారు.

నార్నూర్: పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు అన్నారు. మండలంలోని మాన్కాపూర్‌లో జైభారత్ టీం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రూప్‌దేవ్, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్, ఆత్రం జంగు, దేవరావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం కల్పన అన్నారు. సోమవారం ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని పరిరక్షించినప్పుడే మానవ మనుగడ సాధ్యమన్నారు. బస్టాండ్ పరిసరాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

బేల: నాటిన మొక్కలను కాపాడితేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్ అన్నారు. సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారి అరుణ, సర్పంచ్ ఇంద్రశేఖర్, జక్కుల మధుకర్, సతీశ్‌పవార్, అటవీశాఖ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కట్ట లక్ష్మణచారి డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో బహిరంగ సభ పోసర్‌ను విడుదల చేశారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంత్‌చారిల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో విజయ్, భీమన్న, ప్రభాకార్, రవీందర్, సాయికృష్ణ, వీరాచారి, మురళి, గోపి, సంతోశ్, రవి, మారుతి, అంజన్న పాల్గొన్నారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని ఉండమ్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈవో మల్లయ్య కుమారుడు అరుణ్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ పరామర్శించారు. అరుణ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. వారి వెంట తోట వెంకటేశ్, నర్సింహులు, ప్రకాష్, ఆశన్నయాదవ్ ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య పనులు చేపట్టే భిక్కు రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్, వైద్యాధికారులు, సిబ్బంది బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. వైద్యుడు మహేందర్, సిబ్బంది ఉన్నారు.

చదువుతోనే గుర్తింపు

ఆదిలాబాద్‌టౌన్: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని డీఈవో ప్రణీత అన్నారు. డ్రాపౌట్‌గా ఉన్న విద్యార్థులు ఆదిలాబాద్ పట్టణంలోని అర్బన్ రెసిడెన్షియల్‌లో చేరి గురుకులాలు, మోడల్ స్కూళ్లలో సీట్లు సాధించడంపై వారిని అభినందించారు. సోమవారం అర్బన్ రెసిడెన్షియల్ ప్రత్యేక అధికారి ప్రశాంత్ విద్యార్థులతో డీఈవోను కలిశారు. సెక్టోరియల్ అధికారి నర్సయ్య పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌ను గెలిపించాలి'

బోథ్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు కుస్రం నీలాదేవి అన్నారు. సోమవారం బోథ్ మండల కేంద్రానికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కరత్వాడ ఎంపీటీసీ జుగాది రావ్, సర్పంచులు శ్రీధర్ రెడ్డి, విజయ్, భీంరావ్, లింగు, సురేశ్, పెందూర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఊపందుకున్న విత్తన కొనుగోళ్లు


విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

ఇచ్చోడ: మృగశిర కార్తే మరో రెండు రోజుల్లో ఉన్నందున విత్తనాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సోమవారం ఇచ్చోడ వారసంత కావడంతో ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాల్లో రైతులు బారులు తీరారు. మండల కేంద్రంలో పలు దుకాణాల్లో రైతులు విత్తనాల కొనుగోళ్లలో బిజీగా ఉండడం కనిపించింది.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


పౌష్టికాహారం అందిస్తున్న తహసీల్దార్ లక్ష్మణ్

నార్నూర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు తహసీల్దార్ పౌష్టికాహారం అందించారు. ప్రభుత్వ మాతాశిశు మరణాలను అరికట్టడానికి ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు కౌసల్యాబాయి, అంగన్‌వాడీ టీచర్లు జాదవ్ సుభద్ర, సునీత పాల్గొన్నారు.